తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 208 | గురువారం 19–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in


# మీది ప్రజా పక్షమా..
# ప్రధాని-అదాని పక్షమా?

- కేసీఆర్ కు రేవంత్ సూటి ప్రశ్న.
- అదానీ, ప్రధానిపై తీవ్ర విమర్శలు చేసిన సీఎం రేవంత్
- "చలో రాజ్ భవన్" పేరుతో నిరసన కార్యక్రమం
- రోడ్డుపై బైఠాయించిన రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

మణిపుర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.రహదారిపై బైఠాయించి సీఎం రేవంత్ నిరసన: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రహదారిపై బైఠాయించి సీఎం రేవంత్, మంత్రులు, నేతలు నిరసన తెలిపారు.
బీఆర్‌ఎస్ వైఖరి ఏమిటో చెప్పాలి: అదానీపై మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వైఖరి ఏమిటో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ తన వైఖరి ఏమిటో చెప్పకుండా కాంగ్రెస్ పార్టీని అవహేళన చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదానీ అవినీతి, అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడానికి బీజేపీ చర్యలు తీసుకోకపోవడానికి నిరసనగా దేశ వ్యాప్తంగా ఏఐసీసీ ఛలో రాజ్ భవన్ కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.రాజ్‌భవన్‌కు దగ్గరలోనే పోలీసులు నిలుపుదల చేయడంతో అక్కడే బైఠాయించి ప్లకార్డులు పట్టుకుని అదానీకి, ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. అదానీ అవినీతి, అక్రమాలపై అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అభియోగాలు మోపినప్పుడు జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయడానికి ఇబ్బంది ఏమిటని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మణిపుర్ గత కొంత కాలంగా అల్లర్లతో అట్టడికిపోతోందని, ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించి

మిగతా 2లో

# భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత

- అసెంబ్లీ ముందుకు భూభారతి 2024 ఆర్వోఆర్ చట్టం
- సామాన్యుల భూ హక్కుల పరిరక్షణే ధ్యేయం
- ధరణితో ఉన్న సమస్యలు పోక.. కొత్త తలనొప్పులు
- అన్ని సమస్యలకు కొత్త చట్టంతో చెక్
- ఆర్వోఆర్ 2020 పూర్తి ప్రక్షాళన
- కొత్త చట్టం అవసరాన్ని వివరించిన మంత్రి పొంగులేటి
- ధరణితో ఏర్పడిన సమస్యలపై వివరణ

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యంగా భూభారతి బిల్లును ప్రవేశపెడుతున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణి పోర్టల్‌లో లక్షల సమస్యలు వచ్చాయని అన్నారు. ధరణి పోర్టల్ తో వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని, గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాల దాకా వెళ్లిందని అన్నారు.
కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ధరణి పరిస్థితి తయారైందని అన్నారు. గత పాలకులు తెచ్చిన ఈ లోప భూఇష్ట చట్టం వల్ల భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటి కాళ్ల కింద నేల కదిలిపోయిందని విమర్శించారు. బాధితులు తమ సమస్యలు చెప్పుకున్నా.. పరిష్కారం చేసే మార్గం లేకుండా పోయిందని చెప్పారు. లోపభూయిష్టమైన ఆర్‌వోఆర్ చట్టం2020ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. లోపాల కారణంగా నాలుగు నెలలు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని అన్నారు. 18 లక్షల



26వేల ఎకరాలు పార్ట్‌బీలో ఉందని, ఏ కారణం చేత ఈ భూమిని పార్ట్‌బీలో పెట్టారనేది తెలియడం లేదన్నారు. పాసు బుక్కుల్లో ఉన్న భూములకు, పొజిషన్‌లో ఉన్న భూములకు తేడా కనుక్కోవడానికి చట్టంలో నిబంధనలు రూపొందించామని చెప్పారు. ఈ దేశంలో భూ సంస్కరణలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ అంటేనే ఒక బాధ్యత

మిగతా 2లో

# కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ కీలక ప్రకటన

- కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక ప్రకటన
- హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలను హైడ్రా కూల్చదని స్పష్టం.

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:



కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలను హైడ్రా కూల్చదని ప్రకటించారు. అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జూలై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే వాటిని హైడ్రా కూల్చదన్నారు. అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం ఎప్పుడు కట్టినా ఎఫ్టీఎల్‌లో ఉంటే కూల్చడం జరుగుతుందన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత వాటిని రద్దు చేస్తే.. ఆ కట్టడాలు అక్రమ కట్టడాలుగా పరిగణిస్తూ.. వాటిని హైడ్రా కూల్చివేస్తుందన్నారు. పేదలను ముందు పెట్టి వెనుక నుండి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్‌ని హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. హైడ్రా ఆవిర్భావం తర్వాత అనుమతి ఇచ్చినా ఎఫ్టీఎల్‌లో వుంటే కూల్చడం జరుగుతుందన్నారు.
అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా బాధ్యులను చేయటం జరుగుతుందన్నారు. ఎఫ్టీఎల్ పరిధిలో అనుమతి లేకుండా ఉన్న కన్వెన్షన్ సెంటర్ లాంటి కట్టడాలు హైడ్రా కూల్చి వేస్తుందన్నారు.
హైదరాబాద్‌లో చెరువుల ఎఫ్టీఎల్ మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే హైడ్రా మొదలు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.. త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటించారు. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు, ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కూల్చివేతలు చేసిన తరువాత, ఆ ప్రాంతం ప్రజావసరాల కోసం వినియోగంలోకి వచ్చేలా హైడ్రా ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. హైదరాబాద్‌లో 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టామన్నారు. ఆ చెరువుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రభుత్వ అనుమతులు ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు.
చెరువులు,

మిగతా 2లో



# యూట్యూబర్ భానుచందర్ అరెస్ట్..

- రిమాండ్‌కు తరలింపు మనీ హంట్ ఛాలెంజ్ పేరుతో డబ్బులు వెదజల్లిన యూట్యూబర్ అరెస్ట్
- ఓఆర్‌ఆర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెల్లడి.

మిగతా 2లో

# రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- రూ.224 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి
- సానుకూలంగా స్పందించిన గడ్కరీ
- మానేరుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరిన బండి సంజయ్

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.224 కోట్ల మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ రోజు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశంపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు

మిగతా 2లో

# అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదు..

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్నాపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సీఎం రాజ్‌భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉంది..

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రివర్గ సహచరులతో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఇవాళ హైదరాబాద్ రాజ్ భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారం గురివింద గింజ సామెతను తలపిస్తోందని.. అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రూ.100 కోట్లు అదానీ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ రూపంలో తీసుకుని ఒప్పందాలు తీసుకున్నారని.. ఎందుకోసం రూ. 100 కోట్ల సహాయం అడిగారో, ఎందుకు కలిసి ఫొటోలు దిగారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వందకోట్ల రూపాయలను స్కిల్ యూనివర్సిటీకి ఖర్చు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నప్పుడు గుర్తులేదా అంటూ ప్రశ్నించారు.
వందకోట్ల సహాయం ఎందుకు అడిగారు



మిగతా 2లో

# దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టండి..



- సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరపాలన్న సీఎం
- తెలంగాణకు మంచి జరగాలనే ఈ-రేసింగ్ నిర్వహించినట్లు వెల్లడి
- రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదు..

మొదటి పేజీ తరువాయి

ఎందుకు ఇస్తామన్నారు?.. ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని సవాల్ చేస్తున్నా.. రేవంత్ అయినా రాహుల్ గాంధీ అయినా.. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఒక సాక్ష్యం చూపిస్తారా అంటూ సవాల్ విసిరారు. మన మీడియా ముందు, న్యాయస్థానాల ముందు, ప్రజలముందు ఆధారాలు చూపించకుండా.. విమర్శలు చేయడం సరికాదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో వరుసగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న పార్టీ.. ఇవాళ ఫ్రస్టేషన్‌లో అదానీ మాట మాట్లాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పొరపాటు చేసిందని, కేంద్రం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ ఇవాళ నిరూపించగలదా అంటూ ప్రశ్నలు గుప్పించారు. మాటమీద నిలబడే సత్తాలేక.. ఇవాళ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా సరైన పాలన లేదని.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి మీద విచారణ లేదని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా అన్నిరకాల వైఫల్యంతో.. 12 ఏళ్లలో రావాల్సిన ప్రజావ్యతిరేకతను 12 నెలల్లోనే కూడగట్టుకున్నారన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. రేవంత్ రెడ్డి ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వైపే ఉన్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులేనంటూ కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతే.. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే రావాలని కాంగ్రెస్ అధిష్టానం.. రేవంత్ రెడ్డిని హెచ్చరించిందా అంటూ కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు.అందుకే రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పాట పాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ బొమ్మ బొరుసు లాంటి వ్యక్తులు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దొందూ దొందే అని.. ఈ రెండు పార్టీల పాలనకు తేడా లేదని అన్నారు. ప్రజలను వంచించడంలో తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో, కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో.. ఆ రెండు పార్టీల పనిచేసే తీరు ఒక్కటేనన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మూకుమ్మడిగా.. ప్రజాతీర్పును అగౌరవపరిచిన పార్టీలు నాడు బీఆర్ఎస్, నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పీఏసీ ఛైర్మన్‌గా, ఎంపీ అభ్యర్థిగా.. కాంగ్రెస్ నియమించడం కంటే బలమైన దోస్తీ ఉంటుందా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా కేసీఆర్ మారిస్తే.. రేవంత్ రెడ్డి మరింత దిగజారుస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఎవరు, ఎప్పుడు అప్పులిస్తరో తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదంటూ విమర్శింటారు.



# గురుకులాలపై మంత్రులు సీతక్క, పొన్నం వర్సెస్ గంగుల

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై స్వల్పకాలిక చర్చలో శాసన సభ లో మంత్రులు సీతక్క పొన్నం ప్రభాకర్ కు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కు మధ్య మాటాల యుద్ధం సాగింది. ప్రభుత్వం వైపు నుంచి సీతక్క గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు చేపట్టిన చర్యలను ఏకరువు పెట్టారు. గురుకులాల్లో , హాస్టల్స్ లో ఫుడ్ పాయిజన్ ఘటనలు కొత్తగా చోటుచేసుకున్నట్లుగా ప్రతిపక్షం చెప్పడం విడ్డూరమని, గతం నుంచి కూడా అలాంటి ఘటనలు సాగుతున్నాయని, వాటికి తమ ప్రభుత్వం చెక్ పెట్టేందుకు ఆహార భద్రత కమిటీ, టాస్క్ ఫోర్సులు ఏర్పాటు చేసిందన్నారు. డైట్ చార్జీలను 50శాతం చెప్పడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, కమిటీల ద్వారా 21,941పాఠశాలలు, 495కేజీబీవీల్లో అత్యవసర పనులు గుర్తించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థినిలు శైలజా, భవాని, లీలావతిల గూర్చి, గురుకులాల సమస్యలపై మంత్రి మాట్లాడుతారని ఆశించామని కాని మంత్రి సీతక్క వాటిని ప్రస్తావించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకులు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తెలంగాణ రాకముందు 261గురుకులాలు ఉంటే 7,500మంది విద్యార్థులకే చదివే అవకాశముంటే కేసీఆర్ హయంలో 1029 గురుకులాల ఏర్పాటుతో మెరుగైన విద్యను అందిస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యలు మొదలయ్యాయన్నారు. ఫుడ్ పాయిజన్లు, పాముకాట్లు, ఎలుక కాట్లతో గురుకులాలు ప్రాణాంతకంగా మారాయన్నారు. హీరో వస్తే ఒకరు చనిపోతే క్రిమినల్ కేసులు పెట్టారని, గురుకులాల్లో మరణాలపై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ 2014నుంచి గురుకులాల అద్దెలు చెల్లించని మీరా మాట్లాడేదంటూ మండిపడ్డారు. మేం 216ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కడుతున్నామన్నారు. మేం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుకున్న వారిగా మాకు వాటి సమస్యలు తెలుసన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిన గంగుల కమలాకర్ కు వాటి సమస్యలు తెలియవన్నారు. గురుకులాలను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయం చేస్తుందన్నారు. మొదటిసారి సభకు వచ్చిన పొన్నంకు సభా నియమాలు తెలియవని గంగుల వ్యాఖ్యానించగా, మూడుసార్లు పార్టీ మారిన నీవా మాట్లాడేదంటూ విరుచుకపడ్డారు. గంగుల మళ్లీ మాట్లాడుతూ పెప్పర్ స్ప్రే డూప్లికేట్ నా, దొంగ ఏడుపులా అని నేను అనలేదని, కరీంనగర్ నుంచి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదని వేరే నియోజకవర్గానికి పారిపోయావని పొన్నంపై విమర్శలు చేయగా, పెప్పర్ స్ప్రే ఓరిజినల్ కాదా అనేది పార్లమెంటు ప్రొసిడింగ్స్ లో చూసుకోవచ్చని పొన్నం ప్రతిస్పందించారు.

దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో నా స్థానంలో పోటీ చేయ్ అని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా అనేక మంది జాతీయ నాయకులు కూడా వేరే చోట్ల పోటీ చేశారని పొన్నం గుర్తు చేశారు. వారంతా పారిపోయారా అని పొన్నం నిలదీశారు.మంత్రి సీతక్క జోక్యం చేసుకుని చర్చను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ వ్యక్తిగత విమర్శలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ ను కోరుతున్నామన్నారు. పాఠశాలలు, హాస్టల్ సమస్యలపై చర్చించకుండా రాజకీయ విమర్శలు చేయడం ఎందుకన్నారు. రికార్డులను పరిశీలించి వ్యక్తిగత దూషణాలను రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చర్చను కొనసాగిస్తూ బీఆర్ఎస్ పాలనలో విద్యా విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టి, ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ఏకరువు పెట్టారు.

# భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత

మొదటి పేజీ తరువాయి

అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ధరణిని సాగనంపామని, ఆ స్థానంలో భూభారతి తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామం కంఠాలు, ఆబాదీ భూములకు భూభారతి చట్టం పరిష్కారమార్గం చూపుతుందని అన్నారు. సభ్యులు సలహాలు, సూచనలు చేస్తే తీసుకుంటామని పొంగులేటి చెప్పారు. సాదా బైనామాల కింద 9.24లక్షల దరఖాస్తులొచ్చాయని, వాటికింద అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలుపుకునే అవకాశం చట్టంలో కల్పించామని వివరించారు. ప్రతి ఏడాదీ జమా బందీ కార్యక్రమం నిర్వహించేలా చట్టంలో పొందుపరిచామని వివరించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేలా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు.

మంచిని స్వీకరిస్తంధరణి పోర్టల్ లోని మంచిని స్వీకరిస్తామని, ఎలాంటి భేషజాలకు వెళ్లబోమని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇప్పటి వరకు 22,23 సార్లు డ్రాఫ్టులు మార్చి బిల్లును ప్రవేశపెడుతున్నామని వివరించారు. ప్రత్యేక కమిటీ 33 జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు.



**ప్రతి రైతుకూ భూధార్**

భూభారతి చట్టం ప్రకారం.. ప్రతి రైతుకూ భూధార్ కార్డులను అందించనున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఒక కోడ్ కేటాయిస్తామని చెప్పారు. దానిని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భూభారతి చట్టంలో భూధార్ అంశాన్నీ చేర్చామని వివరించారు.

**ప్రతి ఏటా జమాబందీ**

గతంలో భూములకు సంబంధించి జమాబందీ నిర్వహించే వారని, ఇకపై ప్రతి ఏటా జమాబందీ నిర్వహించడం వల్ల రైతులకు తమ భూమి తమ స్వాధీనంలో ఉందనే నమ్మకం ఏర్పడుతుందని ఈవిషయాన్ని కూడా భూభారతి చట్టంలో చేర్చినట్టు మంత్రి పొంగులేటి చెప్పారు.



# యూట్యూబర్ భానుచందర్ అరెస్ట్..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

మేడ్చల్ జిల్లాఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఔటర్ రింగురోడ్డుపై మనీ హంట్ ఛాలెంజ్ పేరుతో డబ్బులు వెదజల్లుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న భానుచందర్ అనే యూట్యూబర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించారు. ఘట్ కేసర్ పీఎస్‌లో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన రాయలాపురం భానుచందర్ అనే వ్యక్తి ఘట్ కేసర్ వద్ద అవుటర్ రింగురోడ్డుపై తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా వీడియో తీస్తూ కరెన్సీని అవుటర్ రింగురోడ్డుపై చెట్లపొదల్లో విసిరివేస్తూ వచ్చి తీసుకోమని మనీ హంట్ ఛాలెంజ్ చేస్తున్నాడని అన్నారని ఏసీపీ వెల్లడించారు. ఓఆర్ఆర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 179, నేషనల్ యాక్ట్ - 1956 ప్రకారం ప్రకారం భానుచందర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ చక్రపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్ కేసర్ సీఐ పి.పరశురాం, ఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టండి..

మొదటి పేజీ తరువాయి

ఫార్ములా ఈరేస్ వ్యవహారంపై ఈ శాసనసభలోనే చర్చ జరపాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. దమ్ముంటే చర్చ పెట్టాలని తాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానన్నారు. ఈ మేరకు ఆయన సీఎంకు రాసిన లేఖను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, అసెంబ్లీలో చర్చ జరిగితే నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ వ్యవహారంలో గత కొన్ని నెలలుగా తనపై, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం, నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు.ఈరేస్ వ్యవహారంపై ఇటీవలి కేబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘ చర్చ సాగినట్లు మీడియా కథనాలు వచ్చాయని, కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం తెలిపారంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు లీకులు వచ్చాయని తెలిపారు. ఈ అంశంపై కేబినెట్‌లో చర్చించడం కంటే శాసనసభ వేదికగా నాలుగు కోట్ల మంది ప్రజలకు తెలిసేలా చర్చ జరిగితే బాగుంటుందన్నారు. తెలంగాణకు, హైదరాబాద్‌కు మంచి జరగాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా రేస్ నిర్వహించాలని భావించిందని, 2023లో రేస్‌ను విజయవంతంగా నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నట్లు తెలిపారు. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.700 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు నీల్సన్ సంస్థ నివేదిక కూడా తెలిపిందని ఆ లేఖలో గుర్తు చేశారు. ఈసారి కూడా ఈ రేస్ జరగాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందన్నారు. పైగా ప్రభుత్వం తమపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో చర్చిస్తే అన్ని విషయాలను వివరంగా చెబుతామన్నారు.రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి... ఏదో జరిగిందనే అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫార్ములా ఈరేస్ పూర్తిగా పారదర్శకంగానే జరిగిందని తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర ప్రజలకు నిజానిజాలు తెలుసుకునే హక్కు ఉందని, శాసనసభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ అంశంపై సభలో చర్చ జరగాలని కోరుతూ తమ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు లేఖ కూడా ఇచ్చారని సీఎంకు రాసిన లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

# కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

పార్కులతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇలాంటి సంస్థ దేశంలోనే మొట్ట మొదటిదని వెల్లడించారు. గత 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోందన్నారు. ఏమన్నా లోటు పాట్లు ఉంటే వాటిని సవరించుకొని మరింత దృఢంగా నిబద్ధతతో పని చేస్తోందన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను, ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన పలు తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోందన్నారు. భావితరాల భవిష్యత్‌కు మెరుగైన ప్రజా జీవనం కోసం నగర ప్రజలు హైడ్రాకు సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వ దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుందన్నారు. హైడ్రాను బలోపేతం చేయడానికి వివిధ చట్టాల కింద ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెడుతూ వస్తోందన్నారు.టెక్నాలజీ పరంగా కూడా స్ట్రాంగ్ అవుతున్నామన్నారు. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాలను స్వాధీనం చేసుకున్నదని ఆయన వెల్లడించారు. ప్రజలు పెద్ద ఎత్తున హైడ్రా పై నమ్మకంతో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఇలా 5000లకు పైగా ఫిర్యాదులను హైడ్రా పరిష్కరించిందన్నారు. ఇంకా పలు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజా ఫిర్యాదులకు పరిష్కారం చూపించే దిశగా హైడ్రా పని తీరు ఉంటుందన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. భూ కబ్జాల వెనక ఉన్న పాత్రదారులు, సూత్ర దారుల మీద చట్ట పరంగా కఠిన చర్యలు హైడ్రా తీసుకుంటుందని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.





# రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

మొదటి పేజీ తరువాయి

సంబంధించిన ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ప్రధానంగా కేశవపట్నం నుండి పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని, కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని కోరారు. అట్లాగే చొప్పదండి మండలం అర్నకొండ నుండి గోపాల్ రావు పేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీల మేరకు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుండి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు 15 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.దీంతోపాటు కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్ (కి.మీ 18/02), బావూపేట ఖాజీపూర్ ( కి.మీ2/02) వరకు మానేరు నదిపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం సహా మొత్తం 90 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ పనులకు గాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని బండి సంజయ్ కు హామీ ఇచ్చారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపైనా గడ్కరీ ఆరా తీశారు.



# మీది ప్రజా పక్షమా.. ప్రధాని-అదాని పక్షమా?

మొదటి పేజీ తరువాయి

శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీపై స్పందించడం లేదని ఆరోపించారు. అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ ఎస్ కేంద్రానికి లొంగిపోయిందని ధ్వజమెత్తారు. అందుకే అదానీపై బీఆర్ ఎస్ మాట్లాడటంలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ విధానం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రపతి భవన్ వద్ద కూడా ధర్నా: మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదని, వారిద్దరూ నాణానికి బొమ్మ, బొరుసులాంటి వారని విమర్శించారు. బీఆర్ఎస్ జాయింట్ పార్లమెంటు కమిటీ వేయాలని డిమాండ్ చేస్తే, శాసనసభలో తీర్మానం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం వెల్లడించారు. దేశాన్ని దోచుకున్న అదానీపై జేపీసీ వేయడానికి ప్రధాని ఎందుకు సిద్ధంగా లేరని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, అదానీతో లాలూచీ ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. జేపీసీ వేయకపోతే అవసరమైతే రాష్ట్రపతి భవన్ వద్ద కూడా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆ పథకం తెచ్చి భూదందా చేశారు..

○ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్రంలో ధరణి పేరుతో పెద్దఎత్తున భూ బదలాయింపు దందా జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం అయ్యాయని భట్టి ధ్వజమెత్తారు. సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఉపముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ భూ దందాతో పోల్చితే కాళేశ్వరం వ్యవహారం చిన్న విషయమని ఆయన చెప్పారు.ఓ వ్యక్తి గత రెండు, మూడేళ్లపాటు ప్రతి రోజూ ఇదే చేశారని, పార్ట్‌బి భూములన్ని సక్రమం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. దీని మొత్తాన్ని ఫోరెన్సిక్ ఆడిట్ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. హైదారాబాద్ పరిధిలోనే ఇలాంటి భూములు సుమారు 15 వేల ఎకరాలు ఉంటాయని అంచనా వేస్తున్నామని, అంత కంటే ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పార్ట్‌బిలో భూమి అనుకున్న వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారని, ఆ తర్వాత వారు ఇంకొకరి పేరు మీద మ్యూటేషన్ చేశారని, ఇలా పెద్ద దందా జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ భూముల గురించి అడిగేవారు లేరని.. ఇనాం, ఎండోన్మెంట్, వక్ఫ్, అవెక్యు భూములన్నీ లూటీ చేశారని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూముల యజమానులు దేశంలో లేరని, వారంతా పాకిస్థాన్ వెళ్లారని, ఎవ్వరూ అబ్జెక్షన్ చెప్పకపోవడంతో అధికారులు సైతం సహకరించారని భట్టి ఆరోపించారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తుల మీద బదలాయింపు అయిందని ఆయన చెప్పారు. అదంతా ఇప్పుడు వాళ్ల హక్కు అయ్యిందని, ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చింది కాబట్టి భూమి వాళ్లదేనని చెప్పారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని నిజాలూ నిగ్గు తేలుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క చెప్పారు







## లగచర్ల దాడుల్లో పట్నం నరేంద్ర రెడ్డికి బెయిల్..

○ కోర్టు నిబంధనలు ఇవే..

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

లగచర్ల కేసులో అధికారులపై దాడులు చేసి జైలు పాలైన 26 మందిలో 24 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వీరిలో ఏ1 నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్ర రెడ్డి కూడా ఉన్నారు. ఇతనితో పాటు మరో 23 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. మిగతా వారి కేసులో వాదనలు జరుగుతున్నాయి. ఫార్మా సిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం తలపెట్టిన భూముల సేకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసనలో ఏకంగా జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం ఘటనకు ప్రధాన సూత్రధారులుగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్ర రెడ్డి సహా కీలక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్ని నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసింది.మొత్తం 26 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించగా.. వారికి తాజాగా బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కీలక నిందితుడిగా.. ఏ1 గా పోలీసులు పేర్కొన్న పట్నం నరేంద్ర రెడ్డికి సైతం బెయిల్ మంజూరు కాగా.. ఏ2 గా సురేష్ కు ఇంకా బెయిల్ రాలేదు. దాడులకు ప్రజల్ని రెచ్చగొట్టింది. కలెక్టర్ కు మాయమాటలు చెప్పి గ్రామంలోకి తీసుకువెళ్లిన సురేష్.. బెయిల్ పిటిషన్ పై రేపు వాదనలు జరగనున్నాయి.షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. 3నెలల వరకు పోలీసులు దర్యాప్తుకు సహకరించాలని సూచించింది. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్ర రెడ్డికి రూ.50 వేల చొప్పున రెండు పూచికత్తులు, మిగతా వారికి రూ. 20 వేల ష్యూరిటీలు సమర్పించాలని సూచించిన కోర్టు.. వారి విడుదలకు ఆదేశాలు జారీ చేసింది.

## ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:



ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ''పదేళ్లలో భారాస చేయని అభివృద్ధి ఏడాదిలో చేయమంటే ఎలా..? ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఓవర్సీస్ ఉపకార వేతనాలను ఎక్కడ ఆపలేదు. భారాస సభ్యులు సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి'' అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల భారాస హయాంలో ఆ పార్టీ నేతలు రూ. వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, ఈకార్ రేసుల్లో కమీషన్లు తీసుకున్నారన్నారు.

**భారాస సభ్యులపై స్పీకర్ ఆగ్రహం**

అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామన్నారు. మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు కొత్త సభ్యులకు నేర్పించేది ఇదేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

○ మరో 2 రోజులు మరింత తీవ్రంగా చలి గాలులు!

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చలి గాలులు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లోనే కాదు పగటి ఉష్ణోగ్రతలు కూడా దారుణంగా పడిపోతున్నాయి. ఈ క్రమంలో టెంపరేచర్లు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ఇదే మాదిరి మరో రెండు రోజులపాటు చలి తీవ్రత అధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు..

తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతుంది. ఇక ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు చలి తీవ్రత ఇదే మాదిరి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.ఈ క్రమంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతాయని, ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా చోట్ల 7 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 7 డిగ్రీలు, మెదక్‌లో 7.5 చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2 నుంచి 6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా పేర్కొన్నారు. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని, ఉదయం, సాయంత్రం వేళల్లో అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.



## రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనిస్తున్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

ధర్నాల పేరుతో రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అదానీ.. ప్రపంచం ముందు భారతదేశం పరువు తీశారని రేవంత్‌రెడ్డి అంటున్నారు.. అదానీతో చేతులు కలిపి సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీయలేదా.. అని విమర్శించారు.

''తెలంగాణలో వివిధ సంస్థల ఏర్పాటు కోసం అదానీతో సీఎం రేవంత్ రెడ్డి రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నారు. రూ.100 కోట్లు ఎలా వాపస్ ఇచ్చావో.. ఈ రూ.12,400 కోట్ల ఒప్పందాలు కూడా రద్దు చేసుకుని నిజాయతీ నిరూపించుకోవాలి. బయట కుస్తీ.. లోపల దోస్తీ అన్నట్టుంది రేవంత్‌రెడ్డి వ్యవహారం. రామన్నపేటలో డ్రైపోర్టుకు అనుమతిస్తే.. అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీకి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. దాదాపు 12 గ్రామాల ప్రజలు సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం పోలీసులను పెట్టి ఆందోళనకారులను అణచివేస్తున్నారు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, అదానీ సంబంధాలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని భారాస డిమాండ్ చేస్తోంది'' అని హరీశ్‌రావు అన్నారు.

## మూసీ'పై అబద్ధాలు ఎందుకు.. ఎవరి లాభం కోసం?: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:




భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు.

''మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయట పెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ.14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు'' అని కవిత అన్నారు



## అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి.. హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు!

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు సభ్యులు ఉదయమే డ్రింక్ చేసి సభకు వస్తున్నారని ఆరోపించారు. సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. అందుకే అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని సభాపతిని హరీశ్‌రావు కోరారు.



## ఆటో నడుపుతూ అసెంబ్లీకి వచ్చిన కేటీఆర్

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోలో అసెంబ్లీకి వచ్చారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కొందరు ఎమ్మెల్యేలను ఎక్కించుకుని స్వయంగా తానే ఆటో నడుపుతూ అసెంబ్లీకి చేరుకున్నారు. పార్టీ నేతలంతా ఖాకీ చొక్కాలు ధరించి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ''ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉండాలి. 93 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణం. ఆటో కార్మికులు ధైర్యాన్ని కోల్పోవద్దు. భారాస అండగా ఉంటుంది. న్యాయం జరిగేవరకు పోరాడుతాం'' అని కేటీఆర్ అన్నారు. మరోవైపు.. శాసనసభలో ఆటో డ్రైవర్ల సమస్యలపై భారాస వాయిదా తీర్మానం ఇచ్చింది.



## కన్నీళ్లు తెప్పిస్తున్న విషాదం.. లారీటైర్ల మధ్యలో ముద్దైన విద్యార్థిని!

ఖమ్మం ,తెలంగాణ ముచ్చట్లు

ఖమ్మం జిల్లా వైరా రింగ్ రోడ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ కిందపడి టైర్ల మధ్యలో బాలిక హర్ష శ్రీ (13) ముద్దె దుర్మరణం చెందింది. ఈ విషయాన్ని డ్రైవర్ గమనించేలోపు లారీ టైర్లు హర్షశ్రీపై నుంచి కొంత దూరం వరకు రోల్ అయివెళ్లాయి. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచిలుక గ్రామానికి చెందిన 13 ఏళ్ల హర్షశ్రీ వైరా గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. హర్ష శ్రీ తండ్రి చెరుకూరి వీరబాబు ఇటీవల అయ్యప్ప మాల ధరించగా.. తాజాగా ఇరుముడి కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హర్షశ్రీ మంగళవారం తన ఇంటికి వెళ్లింది. ఇక ఇరుముడి కార్యక్రమం అనంతరం మరుసటి రోజు బుధవారం తన మేనమామ శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా భారీ రోడ్ యాక్సిడెంట్ జరిగింది. ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ కిందపడి హర్ష శ్రీ (13) టైర్ల మధ్యలో ముద్దె దుర్మరణం చెందింది.ఈ విషయాన్ని డ్రైవర్ గమనించేలోపు లారీ టైర్ల మధ్యలో హర్షశ్రీ ఇరుక్కుని నుజ్జు నుజ్జయింది. హర్షశ్రీ మృతితో స్వస్థలం కోయచిలుక గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి. హర్షశ్రీ మృతదేహాన్ని చూచి ఆ బాలిక తల్లీ, కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఇక కూతురి మరణ వార్త విన్న తండ్రి శబరిమల మార్గమధ్యంలో కుప్పకూలారు. అనంతరం మార్గమధ్యం నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు. ఇక ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.





## ఈటలకు కాళేశ్వరం కమిషన్ షాక్.. వచ్చే నెలలోనే విచారణ!

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ సర్కార్ నియమించిన కమిషన్ విచారణ కీలక దశకు చేరుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్ కు చేరుకున్న కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్.. నేడు విచారణ సైతం ప్రారంభించారు.నీటిపారుదల శాఖ మాజీ కార్యదర్శి రజత్ కుమార్ నేడు విచారణకు హాజరయ్యారు. ఈ నెల 24 వరకు ఆయన హైదరాబాద్ లోనే ఉండనున్నారు. ఈ షెడ్యూల్‌లో మాజీ ఈఎన్‌సీలు సీ మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ బి.హరిరామ్, సీఎంవో మాజీ కార్యదర్శి స్మితా సభర్వాల్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర అధికారులను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.ఈటల ఏం చెబుతారు?ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల కాళేశ్వరం విచారణలో ఎలాంటి విషయాలను వెల్లడిస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మరో వైపు జనవరిలో కేసీఆర్ అమెరికా టూర్ కు వెళ్లడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు రెండు నెలల పాటు ఆయన అమెరికాలోనే ఉండనున్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మనవడితో గడపడంతో పాటు, వైద్య పరీక్షలు చేయించుకోవడానికే కేసీఆర్ అమెరికా టూర్ కు వెళ్తున్నారన్న ప్రచారం సాగుతోంది. అయితే.. కేసుల నుంచి తప్పించుకోడానికే కేసీఆర్ అమెరికా వెళ్తున్నాడని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. కేసీఆర్ అమెరికా ప్రయాణానికి ముందే కాళేశ్వరానికి సంబంధించి నోటీసులు వస్తే.. ఆయన ప్రయాణం వాయిదా వేసుకనే ఛాన్స్ ఉంది.



### గ్రామ పంచాయతీ కార్మికుల
# పెండింగ్ జీతాలు చెల్లించాలి

- పెద్దమందడి తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు, నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పెద్దమందడి తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గణేష్ కు పలు డిమాండ్లతో, పెండింగ్ జీతాలను చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు గట్టమ్మ మరియు మాజీద్ మాట్లాడుతూ... గత మూడు నాలుగు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని అన్నారు. జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం ముందు మోకాళ్ళతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 23 గ్రామపంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.



## వనపర్తి నల్ల చెరువును ప్రజలకు నడక, వ్యాయామానికి అనుకూలంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి , తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం నల్ల చెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు, ఉదయం, సాయంత్రం కాలి నడక, వ్యాయామం చేసుకునేవిధంగా కట్టను అభివృద్ధి చేయాలని అందుకు అవసరమైన డి.పి.ఆర్.ను సిద్ధం చేసి ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి పై నుండి భారీ వాహనాలు నడవకుండా గేట్ పెట్టాలని సూచించారు. ప్రజలు నడకతో పాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్, పిల్లలు ఆదుకునేందుకు వీలుగా ఆట వస్తువులు, రెండు దిక్కుల అందమైన మొక్కలు వంటివి అభివృద్ధి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, వైస్ చైర్మన్ కృష్ణ, మున్సిపల్ డి. ఈ యునస్, ఏ. ఈ తదితరులు పాల్గొన్నారు.

### పేరుకే పల్లె దావఖాన
# అక్కడ డాక్టర్లు ఉండరు

- పల్లె దవఖాన డాక్టర్లు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పల్లె ప్రజలు..!!

**టేక్మాల్ ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:**




పల్లె దావఖానాలో పేద ప్రజలకు ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రజా సంక్షేమమే తమ ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అనేక సదుపాయాలు మందులు సరఫరా చేసి పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు ప్రభుత్వం 2021 లో పల్లె దవాఖానాలు నిర్మిస్తూ వాటికి తగిన సిబ్బందిని నియమిస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు మందులను అందిస్తున్నది కానీ పల్లె దవఖాన డ్యూటీ డాక్టర్లు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని చెప్పవచ్చు. అవసరమైన సదుపాయాలు మందులు అందుబాటులో ఉంచి పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం సమకూర్చింది. పల్లె దావఖానలో డ్యూటీ డాక్టర్లు వారంలో రెండుసార్లు మాత్రమే పల్లె దవాఖానకు చుట్టపు చూపుగా వస్తూ తమ విధుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు, మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో బుధవారం సూరంపల్లి, ఎల్పుగొండ, ఎల్లకుర్తి, పాల్వంచ, పల్లె దవాఖానకు తాళం వేసి దర్శనమిస్తున్నాయి. గ్రామాలలో పల్లె దవాఖానా డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో పల్లె దవాఖానా వద్ద డాక్టర్ల కోసం పడిగాపులు గాసి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నమని తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక రోగులు మండిపడుతున్నారు. డ్యూటీ డాక్టర్లు పల్లె దవాఖానలకు రాక గ్రామీణ ప్రాంత రోగులకు సరైన వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనితో వైద్య పరీక్షలు, ప్రాథమికంగా మందుల సరఫరా, గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు పిల్లలకు టీకా కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, నివారణ సౌకర్యాలు వంటి సదుపాయాలకు, ఇబ్బందిగా మారి ఆయా గ్రామాల రోగులకు సరైన వైద్యం అందించడంలో జాప్యం ఏర్పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో పలు మార్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో పల్లె దవాఖానా డ్యూటీ డాక్టర్లు పనితీరులో మాత్రం మార్పు రావడంలేదు. ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పల్లె దవఖాన డ్యూటీ డాక్టర్ల పై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా చూడాలని స్థానిక ప్రజలు నాయకులు కోరుతున్నారు.



## ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు.. గుర్తించిన హైడ్రా

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నగరంలోని ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు జరిగినట్లు నీటిపారుదల శాఖ, హైడ్రా అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. ఆక్రమణదారులకు సహకరిస్తూ ముగ్గురు నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ మ్యాప్‌లో మార్పులు చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి హైడ్రా సిఫారసు చేసింది. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో చోటుచేసుకున్న మార్పులను సరిదిద్దుతున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

### చంద్రు తాండలో హరితహరంలో
# నాటిన చెట్లు నేలమట్టం

- తాండలో పచ్చని చెట్లు నేలమట్టం..!
- గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ కరువైంది..?

**టేక్మాల్ డిసెంబర్ తెలంగాణ ముచ్చట్లు:**





టేక్మాల్ మండలంలోని చంద్రుతాండ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం హరితహరం చేట్లలు నేలమట్టం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకంలో భాగంగా మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని చంద్రు తండా గ్రామంలో రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలు నాటి సంరక్షణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి సంరక్షించి పెంచితే వృక్షాలుగా పెరిగి పచ్చని చెట్లు ఆహ్లాదకరంగా ప్రశాంతమైన వాతావరణంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు అందంగా ఆకర్షణీయంగా కనిపించే పచ్చని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నరికి వేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి. ప్రభుత్వం హరిహరం మొక్కలు నాటితే ఎదుగుతున్న తర్వాత చెట్లు నరికివేయండంపై స్థానిక ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేసిన వారిపై సంబంధిత అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వివరణ: నరికివేతకు గురైన చెట్లును చూసి చంద్రు తాండ గ్రామ పంచాయతీకి వెళ్లి కార్యదర్శిని మీ గ్రామంలో హరితహారం చెట్లు నరికివేతకు గురయ్యాయని వివరణ అడగగా నాకేమీ తెలియదని విచారణ చేసి చెట్లను నరికి వేసిన వారికి నోటీసులు ఇస్తానని పొంతన లేని సమాధానం ఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు చెబుతున్నారు.




# అయ్యప్ప భక్తుల అన్నదాన కార్యక్రమం

- తుంగభద్రా నదిలోని భక్త రామప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**జోగులాంబ గద్వాల్,తెలంగాణ ముచ్చట్లు :**

జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ పరిధిలో రాజోలి మండల కేంద్రంలోని తుంగభద్రా నదిలో వెలసిన భక్త రామప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అయ్యప్ప స్వాములు స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి, నదిలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం అక్కడ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. నిత్యం నదిలోని ఈ ఆలయానికి ప్రజలు, భక్తులు పడవ సహాయంతో చేరుకుంటున్నారు.రామప్ప స్వామి ఆలయ పూజారి నిత్యం స్వామివారి సేవల్లో ఉండి, ధూప దీప నైవేద్యాలు అందిస్తున్నారు. భక్తుల భక్తి శ్రద్ధలకు ఆలయం ప్రత్యేక కీర్తి పొందుతోంది.ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త బృందం నరసింహ గురుస్వామి, తేజ గురుస్వామి, ఇతర భక్తులు పాల్గొన్నారు.





## తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా మార్పు

- 2025 కొత్త సంవత్సరం నుంచి పేరు మార్పు అమలు డిసెంబర్ 28 నుంచి 31 వరకు ఖాతాదారులకు అన్ని రకాల సేవలు బంద్ బ్యాంకు మేనేజర్ బి నెహ్రూ ప్రకటన

**స్టేషన్ ఘనపూర్ : తెలంగాణ ముచ్చట్లు**

స్టేషన్ ఘనపూర్ ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరును 1జనవరి 2025 నూతన సంవత్సరం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా పేరు మారుతున్నట్లుగా స్టేషన్ ఘనపూర్ బ్యాంకు మేనేజర్ బి. నెహ్రూ, తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో ఉన్న పలు రకాల గ్రామీణ బ్యాంకులన్నింటిని కలుపుతూ ఆయా రాష్ట్రల పేర్లపై గ్రామీణ బ్యాంకులుగా మార్చిందని అన్నారు. అందువల్ల ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు గా పనిచేస్తున్న ఈ కొత్త సంవత్సరం నుంచి " తెలంగాణ గ్రామీణ బ్యాంక్" గా మారుతుంది అన్నారు. ఈ మార్పుల చేర్పులను చేయడానికి డిసెంబర్ 28, 29, 30, 31 వరకు నాలుగు రోజులపాటు ఖాతాదారులకు అన్ని రకాల సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ నాలుగు రోజులలో బ్యాంకు లో పూర్తిగా మార్పులు చేర్పులు జరుగుతాయి అన్నారు. ఫోన్ పే, గూగుల్ పే, ఆన్లైన్ యూపీఐ సేవలు నిలిచిపోతాయని తెలిపారు. జనవరి ఒకటో తేదీ 2025 నుంచి మళ్లీ ఖాతాదారులకు యధావిధిగా సేవలు అందిస్తామని మేనేజర్ బి. నెహ్రూ ప్రకటించారు.

### త్వరలో ఏకవీరా దేవి
# ఆలయ పునరుద్ధరణ

**-జిల్లా కలెక్టర్ శడాక్టర్ సత్య శారదా**

**వారంగల్/గీసుగొండ,తెలంగాణ ముచ్చట్లు:**

కాకతీయుల కాలంలో నిర్మించబడిన కాకతీయ ఇలవేల్పు ఏకవీరా దేవి ఆలయ పునరుద్ధరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ విషయం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలియజేశారు.బుధవారం, కలెక్టర్ మొగిలిచర్ల గ్రామాన్ని సందర్శించి, శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురావస్తు శాఖ, పర్యాటక శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు.
ఆలయ పునరుద్ధరణ పనులను ప్రారంభించాలని, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. మొగిలిచెర్ల గ్రామ చరిత్ర మరియు ఏకవీరా దేవి ఆలయ చరిత్రను టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య విపులంగా వివరించారు.అయితే, వందల సంవత్సరాల క్రితం కాకతీయులచే నిర్మించబడిన ఈ ఆలయాన్ని పరిరక్షించుకోవడం, పునరుద్ధరణ పనులను త్వరగా ప్రారంభించడం, పురావస్తు శిల్పాలను కాపాడడం, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లు నాయక్‌కు కలెక్టర్ ఆదేశించారు.పునరుద్ధరణ పనులను చేపట్టి ఆలయాన్ని ప్రజలు మరియు పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే, కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆలయ భూములకు సంబంధించి సర్వే చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న శిల్పాలను ఒకే ప్రదేశంలో భద్రపరచి, ప్రదర్శన కోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిల్లా పురావస్తు శాఖ అధికారి మల్లు నాయక్, తహసీల్దార్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




### నీజాయితీతో పని చేసి
# ప్రజల మన్ననలను పొందండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**స్టేషన్ ఘనపూర్ :తెలంగాణ ముచ్చట్లు**

నీజాయితీతో పని చేసి ప్రజల మన్ననలను పొందాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. వార్షిక తనీఖీల్లో భాగంగా స్టేషన్ ఘన్ పూర్ ఏసిపి కార్యాలయమును వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం తనీఖీ చేసారు. తనీఖీ భాగంగా ఏసిపి కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఏసిపి కార్యాలయము నకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, ఏసిపి అధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అరా తీయడంతో పాటు, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ ఏసిపి కిషన్ అడిగి తెలుసుకొవడంతో పాటు, పెండిరగ్‌లో వున్న ఎస్సీ,ఎస్సీ కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్బంగా పరకాల సబ్`డివిజనల్ పోలీస్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని,ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు, బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్ళల్లో సిసి కెమెరాలు ఏర్పాటు అధికారులు చోరవ చూపించాలని, నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని. చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితిలో వదలవద్దని, సమాజంలో ఏం జరుగుతోందని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తూ సమాచార సేకరణ అవరమని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, ఓపిక,సహనంతో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పరిశీలించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు.ఈ తనీఖీలో వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ , ఎ. ఎస్పీ మన్నన్ భట్ ,ఏసిపి భీం శర్మ , స్టేషన్ ఘన్పూర్ సబ్`డివిజనల్ పోలీస్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ జి. వేణు, రఘునాథ్ పల్లి సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,, ఎస్.ఐ లు వినయ్ కుమార్, రమేష్, నవీన్ కుమార్, నరేష్, శ్రవణ్ కుమార్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

- ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి

**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం,సహకారం అవసరమని ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు.రుణ లక్ష్యాలు బ్యాంకర్లు పూర్తి చేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో జిల్లాస్థాయి డీసీసీ,సమా వేశం జరిగింది.ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు,గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు,ప్రభుత్వ శాఖల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు.




అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలకు గాను 1802.08 కోట్ల రూపాయలు రైతులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1231 కోట్ల రూపాయలు అందించారని వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 3785.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా సెప్టెంబర్ వరకు రూ.2136 కోట్లు అందించినట్టు తెలిపారు. భారీ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలకు 997.63 కోట్ల రూపాయలకు గాను రూ. 765 కోట్లు, ప్రాధాన్యత ఉన్న రంగాలకు రూ. 4891.15 కోట్లకు గాను రూ. 3008 కోట్లు అందించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు గాను రూ. 492 కోట్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2024 వరకు 9536 మంది లబ్ధిదారులకు 100 కోట్లు ముద్ర రుణాలు అందించినట్లు తెలిపారు. పీఎం ఈజిపి,పీఎం ఎఫ్ ఎం ఈ,స్టాండ్ అప్ ఇండియా, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, విద్య విద్య రుణాల లాక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు,యూనియన్ బ్యాంకు డి ఆర్ హెచ్ మహేష్,ఆర్బీఐ ఏజీఎం పల్లవి,నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్,డీఆర్డీఓ



కౌసల్యాదేవి,వ్యవసాయ అధికారి,పశుసంవర్ధక శాఖ బాలకృష్ణ జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు,అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డ్రోన్ స్ప్రేయర్ తో పంటలకు పిచికారి సులభతరం

**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు:**

డ్రోన్ స్ప్రేయర్స్ తో రైతులు పంట చెనులో పిచికారీ చేయడం ఎంతో సులభతరమని దీని వల్ల రైతులకు ఎంతో లాభదాయకం గాను సమయం ఎంతో ఆదా అవుతుందని మన అగ్రిటెక్ అధినేత పాశికంటి రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు సేవలను అందిస్తూ మన అగ్రిటెక్ సంస్థ మరింతగా విస్తరించి రైతులకు విస్తృతంగా సేవలందించే దిశగా ముందుకు సాగుతున్నదని ఇప్పటికే రైతులకు మన అగ్రిటెక్ వాలంటీర్లు గ్రామ గ్రామాన క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తుండడం విశేషం. ఈ సందర్భంగా మన అగ్రిటెక్ సంస్థ సిఈఓ రమేష్ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. దక్ష కంపెనీ వారి నూతన డ్రోన్ స్ప్రేయర్ ను మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో వరంగల్ పరిసర ప్రాంతాల్లోని పంట చేన్లలలో పెద్ద ఎత్తున డ్రోన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్ష డ్రోన్ స్ప్రేయర్ యాజమాన్యంతో కలసి మన అగ్రిటెక్ సిఈఓ రమేష్ డ్రోన్ డెమో ప్రదర్శన నిర్వహించి రైతులకు పూర్తి అవగాహన కల్పించారు.

డ్రోన్ స్ప్రేయర్ ద్వారా రైతులకు లాభసాటి వ్యవసాయం చేసుకోవచ్చని డ్రోన్ ద్వారా ఒక రైతు ఎక్కువ సమయంలో చేసే పనిని అతి తక్కువ సమయంలో ఎలాంటి శ్రమ లేకుండా పూర్తిస్థాయిలో చేసుకోవచ్చునని అంతే కాకుండా డ్రోన్ కొనుగోలు చేసిన రైతన్నలు ఇతర రైతులకు అద్దెకు ఇచ్చి పంటలకు పిచికారి చేసి అధిక మొత్తంలో డబ్బులు సంపాదించుకోవచ్చు అని రమేష్ పేర్కొన్నారు.

డ్రోన్ కోసం పెట్టిన పెట్టుబడి కేవలం నెల రోజుల్లో పూర్తిగా వెనక్కి సంపాదించు కోవచ్చు అన్నారు. దక్ష కంపెనీ వారి డ్రోన్ స్ప్రేయర్ ను ఉపయోగించి రైతులు ఆధునిక వ్యవసాయం దిశగా లాభసాటి వ్యవసాయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా మన అగ్రిటెక్ సంస్థ కేవలం రైతులకు అందుబాటులో ఆధునిక వ్యవసాయాన్నీ అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని రైతులు ఎంతో కష్టపడి పాత పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయడం వల్ల నష్ట పోతున్నారు. అందుకే రైతుకు ఆధునిక వ్యవసాయాన్ని అంది పుచ్చుకోవాలని రమేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులు డ్రోన్ స్ప్రేయర్ గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా దానిని ఎలా ఉపయోగించాలో దక్ష కంపెనీ వారిని అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. దక్ష వారి డ్రోన్ స్ప్రేయర్ ప్రత్యేకమైనదని 10 లీటర్ల నీటి సామర్ధ్యంతో 7నిమిషాల వ్యవధిలోనే ఎకరం పంటకు పిచికారీ చేసుకోవచ్చునని తెలిపారు.



## పొగాకు రహిత యువతను మార్చుదాం

- విష్ణువర్ధన్ రెడ్డి పొగాకు జిల్లా నియంత్రణ విభాగము సూపర్వైజర్

**సంగారెడ్డి తెలంగాణ ముచ్చట్లు**

సంగారెడ్డి పట్టణం , గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, రాజీవ్ పార్క్, కొత్త బస్టాండ్ మరియు పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పొగాకు వాడకం ద్వారా కలిగే దుష్పర్ నామాలు గురించి అవగాహన కల్పించినారు ఆరోగ్య పరమైనఅంశాలపై వివరించినారు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా యువత మరి పొగాకు వాడకలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి ముఖ్యంగా యువతకు పొగాకు వాడకం దూరంగా ఉంచడం. పొగాకు రహిత గ్రామాలకు తీర్చిదిద్దడం

**పొగాకు రహిత విద్య సంస్థలు**

తీర్చిదిద్దడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము నేటి యువత పొగాకువస్తువులైన బీడీ సిగరెట్ జరదా గుట్కా పాన్ మసాలాలు సేవించి చిన్న వయసులోనే వివిధ రకాల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. బహిరంగ ప్రదేశంలో పొగాకు తాగినప్పుడు వారి పిలిచిన పొగను ఇతను పీల్చడం ద్వారా ఇతరులు వ్యాధుల బారిన పడుతున్నారు ముఖ్యంగా గమనించలి మానవ శరీరం నికోటిన్ అలవాటు పడి తర్వాత వ్యసనం గురై జీవితంలో ఎన్నో ఇబ్బందులు గురై అకాల మరణం సంభవిస్తున్నాయి ఆరోగ్యశాఖ వారు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము ముఖ్యంగా టెలిమానస్ 14416 ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నాము అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ సి డి క్లీనింగ్ నందు. బిపి, షుగర్, క్యాన్సర్ సంబంధించిన ప్రాథమిక పరీక్ష నిర్వహించి వాళ్లకు సల లుసూచనలు ఇవ్వడం జరుగుతుంది ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి వివిధ సమస్యలతో ఒత్తిడికి లోనవుతున్నారు తర్వాత వివిధ వ్యసనాలకు గురై బానిసై కుటుంబాన్ని మరియు తన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు ప్రతి ఒక్కరు తన ఆరోగ్యం తన చేతిలోనే ఉన్న విషయాన్ని మర్చిపోయి వివిధ అలవాటు ద్వారా అనారోగ్య గురి కవద్దన్నారు ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరారు పొగాకు ఉత్పత్తులను బహిరంగ ప్రదేశంలో సేవించినచో జరిమానా విధిస్తామని హెచ్చరించినారు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి పొగాకు రహిత గ్రామాలకు తీర్చిదిద్దడం లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్. శోభన్ ప్రయాణికులు , యువతి, యువకులు ఇతరులు పాల్గొన్నారు.



## అక్రమ కేసులను ఎత్తి వేయాలి

- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లేతకులా సంజీవరెడ్డి....

**ఆత్మకూర్ తెలంగాణ ముచ్చట్లు:**


ప్రభుత్వం అక్రమంగా లగచర్ల అమాయక గిరిజన రైతుల పైన పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లేతకుల సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు గూడెపాడు గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లేతకుల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఫార్మా కంపెనీకి తమ భూములు ఇవ్వమని అన్నందుకు ప్రభుత్వం రైతులపై కక్ష గట్టి అక్రమంగా నిర్బంధించి రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసల కు గురి చేశారని ఆరోపించారు. నిరుపేద గిరిజనుల పైన అధికారంతో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని ఆయన మండిపడ్డారు. రైతుల పైన పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నిర్బంధ పాలన కొనసాగిస్తుందని పేద అమాయకుల పైన పోలీసుల చేత నిర్బంధ కాండ కొనసాగిస్తుందని సంజీవరెడ్డి విమర్శించారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు రంపిస మనోహర్, మచిక యాదగిరి, సాహోరే కమల రాజేశ్వరరావు, మాదాసి అన్నపూర్ణ రాజు, మైనార్టీ నాయకులు ఎండి అంకుస్,గ్రామ పార్టీ అధ్యక్షులు పాపని రవీందర్, సిరంశెట్టి సుమన్, టిఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం మధుకర్, ఆత్మకూరు గ్రామ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రవీణ్ రెడ్డి, పెరుమాండ్ల బిక్షపతి, కలకోటి రాజేష్,రేవూరి సంపత్ రెడ్డి, న్యాతని ప్రవీణ్, వేల్పుల గణేష్, వంగేటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




## కనీస వసతులు లేక అంధకారంలో ఎల్. బి. నగర్

**ఎల్బీనగర్ తెలంగాణ ముచ్చట్లు**

నియోజకవర్గ బిజెపి కార్పొరేటర్లు తమ తమ డివిజన్ ల అభివృద్ధికీ సరిపడా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్. బి.నగర్ జోనల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడం జరిగినది. నిధుల కేటాయింపులో బీజేపీ కార్పొరేటర్లు ఉన్నటువంటి డివిజన్ లకు అన్యాయం జరుగుతుందని, ఎల్. బి. నగర్ జోనల్ కమీషనర్ హేమంత కేశవ్ పాటిల్ (ఐఏఎస్ )కి బీజేపీ కార్పొరేటర్లు వివరించారు.ఈ సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం వల్ల కాలక్రమేనా అనేకమైన నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని, కనీస మౌలిక వసతులు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారన్నారు .ఎల్. బి. నగర్ ప్రజల నుండి ఇళ్ల నిర్మాణ పర్మిషనలా పేరుతో కోట్ల కొద్దీ సొమ్మును తీసుకుంటున్న నిధుల కేటాయింపులో మాత్రం అన్యాయం చేస్తుందని, ఏటా ఎల్. బి. నగర్ ప్రజల నుండి తీసుకుంటున్న డబ్బులను తీసుకెళ్లి ఓల్డ్ సిటీ లో పెడుతుందని.అధికారులకి నూతన స్ట్రీట్స్ కోసం వినతిపత్రలు ఇచ్చి దాదాపు సంవత్సరకాలం గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఒక్క నూతన స్ట్రీట్ లైట్ కూడా ఇవ్వలేదని, అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న స్ట్రీట్ లైట్స్ టెక్నీషియన్స్ కు వేతనాలు సరైన సమయంలో చెల్లించకపోవడంతో వారు విధులు కూడా నిర్వహించడం లేదని.డివిజన్ల లో శానిటేషన్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని, రాంకీ సిబ్బంది చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించుకపోవడంతో దూర్వసనతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని వారు తెలిపారు.కావున తక్షణమే కమీషనర్ తో మాట్లాడి 2,3 రోజులో ఎల్. బి. నగర్ నియోజకవర్గానికి నిధుల కేటాయింపు పై స్పష్టత ఇవ్వాలని, లేదంటే తమ పార్టీ శ్రేణులతో కలిసి జోనల్ కార్యాలయాని ముట్టడించడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ,బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ , సరూర్నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి , మనసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ,, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ , గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ మహేశ్వర్ రెడ్డి , మల్కాజ్గిరి పార్లిమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ , గంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## భగవంతుని ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలి

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**టేక్మాల్ డిసెంబర్ తెలంగాణ ముచ్చట్లు:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బుధవారం ఎల్లంపల్లి గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరైనారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు ఆయనకు అందజేశారు. అనంతరం వృక్షుంపేట స్వామీ వారి దివ్య ఆశీస్సులు పొందారు. గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయాల వార్షికోత్సవ కార్యక్రమానికి రావడం ప్రసన్నాంజనేయ స్వామి దర్శనం నాకు చాలా సంతోషంగా ఉందని ఆ భగవంతున్ని ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానీ ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు నాకోటి భాస్కర్ ,చింత రవి మహేందర్ సాయిలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు





## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు పాడిగేదెలను అందించాలి

- లబ్ధిదారుల ఎంపిక జరిగి 5 సంవత్సరాలు అవుతున్న అధికారులు గ్రౌండింగ్ చేయడం లేదు!
- లోకల్ గేదెలను మాత్రమే పంపిణీ చేయాలి!
- వార్షిక ప్రణాళికను వెంటనే ప్రకటించి అమలు చేయాలి!
- డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్!

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన మినీ డెయిరీ పాడి గేదెల యూనిట్ లబ్ధిదారులకు వెంటనే గ్రౌండింగ్ చేసి రెండవ విడత పాడి గేదెలను అందించాలని దళిత బహుజన ఫ్రంట్ డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం హనుమకొండ ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటయ్య కు లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాదాసి సురేష్ మాట్లాడుతూ ఆత్మకూర్,దామెర మండలాలలో 2018 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూపాయలు నాలుగు లక్షల వ్యయంతో నాలుగు పాడి గేదెల కల్గిన 175 మినీ డైరీ యూనిట్లు మంజూరయ్యాయని వీటిని గ్రౌండింగ్ చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ కొంతమందికి మాత్రమే మొదటి విడతగా హర్యానా రాష్ట్రానికి చెందిన నాసిరకం రెండు గేదెలను మాత్రమే పంపిణీ చేసి రెండవ విడత రెండు పాడిగేదెలను పంపిణీ చేయకుండా, బ్యాంకులు నిరాకరిస్తున్నారు అన్న సాకుతో చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా పథకాన్ని వెంటనే గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులకు నాణ్యమైన లోకల్ పాడి గేదెలను మాత్రమే పంపిణీ చేయాలని 202425 సంవత్సరం వార్షిక ప్రణాళిక ప్రకటించి బ్యాంకులతో సంబంధం లేకుండా పూర్తిగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారానే కొత్త లబ్ధిదారులకు రుణాలను అందించాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు పాడి గేదెలను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిబీఎఫ్ నాయకులు గిన్నారపు మైబు,మాదాసి స్వామి, గిన్నారపు రాజు,మాదాసి రాజేష్ తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మంత్రి చొరవతో గన్నీ సంచులు

- రాజారాంపేట సోసైటీ చైర్మన్ డి.బాలాజీ.

**నేలకొండపల్లి, తెలంగాణ ముచ్చట్లు**

సొసైటీ పరిధిలోని చెరువుమాధారం, మంగాపురంతండా లో ఇప్పటి వరకు 59 వేల బస్తాలను కొనుగోలు చేసినట్లు రాజారాంపేట సోసైటీ చైర్మన్ డి.బాలాజీ పేర్కొన్నారు. మండలం లోని మంగాపురంతండా లో రైతులకు బుధవారం గన్నీ సంచులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... సోసైటీ పరిధిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు వేగంగా చేపట్టినట్లు తెలిపారు. గత రెండు రోజుల క్రితం గన్నీ సంచుల కొరత ఉండటంతో సమస్య ను రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే 25 వేల గన్నీ సంచులను సోసైటీ అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులతో పాటు సోసైటీ పాలకవర్గం. మంత్రి కి గుణపడి ఉంటామని పేరోన్నారు. రాజారాంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధి లో మిగిలిన ధాన్యం ను శరవేగంగా కాంటాలు వేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కోన్నారు. రైతులు కేంద్రం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ కార్యదర్శి రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం 19 –12–2024


# బీఆర్ఎస్ నేతలకు సవాల్, చర్చకు సిద్ధమా: భట్టి విక్రమార్క



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక అంశాలపై తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని భట్టి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో రూ.7,11,911 కోట్ల అప్పులను తెలంగాణ ప్రజలకు మిగిల్చారని భట్టి ఆరోపించారు. వారి హయాంలో చేసిన అప్పులపై తాము ఎక్కడైనా చర్చకు సిద్ధమంటూ భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.


పదేళ్లు దోచుకున్నారు..గత ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి ఇప్పటివరకూ రూ.66,722 కోట్లు బ్యాంకులకు చెల్లించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మీరూ అప్పులు చేస్తున్నామని బీఆర్ఎస్ నేతలు మమ్మల్ని అంటున్నారు, వాళ్లు దోచుకోటానికి అప్పులు చేస్తే తాము ప్రజల కష్టాలు తీర్చేందుకు అప్పులు చేస్తున్నామని ఆయన చెప్పారు. పదేళ్లపాటు దోచుకున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు తమ ప్రభుత్వంపై నేడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లను పట్టించుకోలేదు కాబట్టే నేడు అవి దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని భట్టి మండిపడ్డారు.

**అది కాకుండా రూ.30 వేల కోట్లు..**

రైతులకు ఇచ్చిన ప్రతి ఒక్క మాటనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని డిప్యూటీ సీఎం చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ రైతులు ధాన్యం పండించారని వాటిని కొనుగోలు చేస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఒక పక్క బీఆర్ఎస్ చేసిన అప్పులు కడుతూనే మరో పక్క రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ నేతలు రైతు బీమా పదేళ్లపాటు కట్టకుండా వదిలేశారని, తాము ప్రతి ఒక్క రైతుకూ బీమా కట్టినట్లు చెప్పుకొచ్చారు. రైతు రుణమాఫీ కాకుండా రూ.30 వేల కోట్లు ఇప్పటికి వరకూ ఖర్చు చేసినట్లు భట్టి వెల్లడించారు.

### విద్యుత్ బిల్లులు చెల్లించలేదు..!

**రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ కోసం ప్రతి నెలా రూ.11,270 కోట్ల బిల్లులు కడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్యుత్ బిల్లులు కట్టకుండా వదిలేశారని, నిబద్ధత కమిట్మెంట్‌తో తాము పని చేస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. డిసెంబర్ 28న భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు అందజేయబోతున్నట్లు భట్టి వెల్లడించారు. వారిలా గాలి మాటలు మాట్లాడి ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు తాము మాట్లాడమని అన్నారు. వారు తమ సోషల్ మీడియాలో తప్పుడు రాతలు రాసినంత మాత్రానా ప్రజలు నమ్మరని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల కింద ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు ఇవ్వబోతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు.**



# ‘రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధ పాలన’

**తొర్రూరు ,తెలంగాణ ముచ్చట్లు:**

రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. లగచర్ల గిరిజన రైతులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఎక్కడని ప్రశ్నించారు. నాణ్యతలేని భోజనంతో గురుకుల విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.సమావేశంలో భారాస మండలాధ్యక్షుడు సీతారాములు, నేతలు చిన్నఅంజయ్య, శ్రీనివాస్, ప్రమోద్, ఐలయ్య, వెంకన్న, కాలునాయక్, జనార్ధనరాజు, వెంకన్న, సురేష్, కుమారస్వామి పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత రాజ్యాంగంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం లగచర్ల రైతుల అరెస్టును నిరసిస్తూ కామారెడ్డిగూడెంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచి ఆత్మహత్యకు కారణమైన వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. ఇటీవల ఓ సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఘటన పూర్తిగా పోలీసులు, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే జరిగిందని తెలిపారు. లగచర్ల రైతులపై కేసులు సంకెళ్లతో ఆసుపత్రికి తీసుకెళ్లడంపై ఆగ్రహా వ్యక్తం చేశారు. నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, రవి, కొల్లూరి సోమయ్య, మల్లేశం, రత్నాకర్‌రెడ్డి, సోమసుందర్, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.



# ధరల పతనం.. రైతుల్లో అయోమయం !

**ఖమ్మం, తెలంగాణ ముచ్చట్లు:**

పంట ఉత్పత్తుల ధరలు పతనమవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిరపకు సరైన ధర పలకకపోవటంతో నష్టాల పాలవుతున్నారు. ధాన్యం, మొక్కజొన్న మినహా పెసలు, కందులు, మినుములు, వేరుసెనగ తదితర పంట ఉత్పత్తులు కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముడుపోతుండటం గమనార్హం.

**గణనీయంగా తగ్గిన పత్తి దిగుబడులు**

ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం నాలుగు క్వింటాళ్ల పత్తి వస్తోంది. దీనికి తోడు విపణిలో కనీస మద్దతు ధర అందట్లేదు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినా చాలా తక్కువ మొత్తంలోనే అక్కడ సరకు కొన్నారు. నాణ్యత సరిగ్గా లేదని తిరస్కరించటంతో మార్కెట్లలో, బయట ప్రైవేటు వ్యాపారులు, దళారులకు రైతులు తక్కువ ధరకే అమ్ముకున్నారు. క్వింటా ధర రూ.6,500,7వేలు పలికింది.

మిరప రైతులపై ఎగుమతుల ప్రభావం

రైతులు గతేడాది మిరపనే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గతేడాది క్వింటా గరిష్ఠ ధర అత్యధికంగా రూ.22వేల వరకు ఉండటంతో మరింత పెరుగుతుందనే ఆశతో రైతులు, వ్యాపారులు నిల్వ చేశారు. ఏడాదిగా ధరలు తిరోగమన దశలో ఉన్నాయి. ఇంకా లక్షల బస్తాల మిరప ఏసీల్లో ఉంది. గతేడాది కర్ణాటకలో పంట బాగా పండటంతో దాని ప్రభావం ఇక్కడి మిరపపై పడింది. దీనికి తోడు ఎగుమతులు తగ్గిపోయాయి. నూనె పరిశ్రమలో మిరపను వినియోగించే వ్యాపారులూ కర్ణాటక పంటపైనే ఆధారపడటంతో ధరలు తగ్గుముఖం పట్టాయని ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం తెలిపారు.

**కంది పంట విస్తీర్ణం తగ్గుముఖం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిరప సాగు విస్తీర్ణం నామమాత్రంగా ఉన్నప్పుడు కంది పంట ఎక్కువగా సాగయ్యేది. మూడు దశాబ్దాల క్రితం ఖమ్మం నగరంలోనే 25 కందిపప్పు మిల్లులు ఉండేవి. ఇప్పుడు పదకొండు మాత్రమే పనిచేస్తున్నాయి. మధిరలో తొమ్మిది ఉంటే అవన్నీ మూతపడ్డాయి. కొత్తగూడెంలో రెండింటికీ ఒక్కటే మిగిలింది. వైరాలో ఆరింటికి రెండు పనిచేస్తున్నాయి. కంది సాగు విస్తీర్ణం తగ్గటంతో దాని ప్రభావం మిల్లుల పై పడింది. అందుకే కందిపప్పుపై ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి తర్వాత కొత్త సరకు వస్తుంది.



# మానసిక ఒత్తిడితోనే హైమావతి మృతి: ఝాన్సీ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తిరుమలాయపాలెంలో ఎంఆర్‌సీలో సీసీఓగా పనిచేసే పొరుగు సేవల ఉద్యోగి హైమావతి పని ఒత్తిడి కారణంగానే గుండెపోటుతో మంగళవారం మృతి చెందిందని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్య ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో హైమావతి ఇంటి నుంచి పెద్దతండా వరకు ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ వెంటనే స్పందించి హైమావతి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, విజయ్ సంఘీభావం తెలిపారు. సంఘాల నాయకులు వీరస్వామి, కనకయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.



# విజయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: సుజయ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయడంలో రమాదేవి పబ్లిక్ స్కూల్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని రామోజీరావు మనవడు సుజయ్ చెరుకూరి పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన కోకరిక్యులర్ యాక్టివిటీస్ (సీసీఏ), టెక్ ఫెస్ట్, క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి సీహెచ్ సుజయ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు విజయాలను, అందుకున్న బహుమతులను ప్రోత్సాహంగా భావించాలని, విజయ గర్వం దరిచేరకుండా నిరంతరం ఏకాగ్రతతో ముందుకు సాగాలన్నారు. తాతయ్య పద్మవిభూషణ్ పురస్కార గ్రహీతగా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించినా ఆయనలో ఏనాడు గర్వం దర్శనమిచ్చేది కాదన్నారు. రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు అన్నిరంగాల్లో విజయాలు సాధిస్తుండటం అభినందనీయమన్నారు. ఇంతమంది విద్యార్థులకు బహుమతులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు మరింత ఉత్సాహంగా భవిష్యత్తుపై దృష్టి పెట్టి ముందుకు సాగాలని పేర్కొన్నారు. రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావి చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఖమర్ సుల్తానా పాల్గొన్నారు.

**ఆద్యంతం ఉత్సాహ భరితం**

టెక్ ఫెస్ట్, సీసీఏ, స్పోర్ట్స్‌లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీహెచ్ సుజయ్.. రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావి చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఖమర్‌సుల్తానాలతో కలిసి ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. గంగ, యమున, కావేరి, కృష్ణ హౌస్‌లలో వ్యక్తిగత ఛాంపియన్లు 8, స్కూల్ ఛాంపియన్లు ఇద్దరు, ఎన్‌సీసీ ఉత్తమ క్యాడెట్లు 4, జాతీయస్థాయి సీఐఎస్‌సీఈలో పాలుపంచుకున్న 12 మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. సీసీఏలో ఉత్తమంగా యమున హౌస్, క్రీడల్లో కావేరి హౌస్‌లు ట్రోఫీలను దక్కించుకున్నాయి. విద్యార్థులు ధనుష్‌రెడ్డి, మోర మహతినాయుడు పాఠశాల ఛాంపియన్లుగా నిలిచారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి



# నీతూబాయి ఎక్కడ..?

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రోజూ కనీసం రూ.24 లక్షల విక్రయాలు రూ.కోట్లలో ఆస్తులు.. వీటన్నింటికీ మించి పదుల సంఖ్యలో పోలీసు కేసులు.. ఇదంతా పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ గురించి కాదు.. గంజాయి విక్రయాల్లో ఆరితేరిన ఓ మహిళ నేపథ్యం. అబ్కారీ బృందాలు ఇప్పుడు గంజాయి క్వీన్ నీతూబాయి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. ధూల్‌పేటలో గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు చేపట్టిన ‘ఆపరేషన్ ధూల్‌పేట’లో భాగంగా ఇప్పటివరకు 150 మందితోపాటు గంజాయి సిండికేట్‌లో సభ్యురాలైన అంగూరీబాయిని 5 రోజుల కిందట అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం అంగూరీబాయి మేనల్లుడు శుభంసింగ్‌ను అరెస్టుచేశారు. దర్యాప్తులో అతడిని ప్రశ్నించినప్పుడు నానక్‌రామ్‌గూడకు చెందిన నీతూబాయి పేరు బయటకొచ్చింది. నానక్‌రాంగూడ లోథాబస్తీకి చెందిన కాలావతి నీతూబాయి(46) పుట్టి పెరిగింది ధూల్‌పేటలో. ఒకప్పుడు గుడుంబా వ్యాపారంలో ఉండేవారు. ప్రభుత్వ చర్యలతో అది వదిలేసి గంజాయివైపు మళ్లారు. నీతూబాయి, భర్త మున్నాసింగ్, ఇద్దరు కుమారులు, బంధువులందరిదీ ఇదే దందా. అంగూరీ బాయి నీతూబాయికి బంధువు. నీతూబాయి రోజూ సగటున రూ.24 లక్షల సరకు అమ్ముతోంది. ఒడిశాలో కిలో గంజాయి రూ.8 వేలకు కొని 5, 10 గ్రాములుగా పొట్లాల్లో నింపుతారు. 5 గ్రాముల పొట్లాన్ని రూ.500కు విక్రయిస్తారు. నానక్‌రాంగూడ పక్కనే ఐటీ కారిడార్ ఉండటంతో ఐటీ ఉద్యోగులు గంజాయి కొనేందుకు వస్తుంటారని చెబుతున్నారు.ఎనిమిదేళ్లు.. రూ.కోట్లలో ఆస్తులు.. నీతూబాయి కుటుంబం ఎనిమిదేళ్లలో రూ.కోట్లలో ఆస్తులు కూడగట్టింది. 2023 ఆగస్టులో గోల్కొండ పోలీసులకు పట్టుబడినప్పుడు ఆరా తీయగా బ్యాంకు ఖాతాల్లో రూ.1.63 కోట్లు.. స్థిరాస్తులు రూ.2 కోట్ల వరకు ఉన్నట్లు గుర్తించారు. రూ.4 కోట్ల ఆస్తుల్ని ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం జప్తుచేశారు. ఆ కేసులో జైలుకెళ్లినా ఆమె పద్ధతి మార్చుకోలేదు. టీజీ న్యాబ్ ఈ ఏడాది మార్చిలో డెకాయ్ ఆపరేషన్ చేసి నీతూబాయి, ఆమె భర్తతోపాటు 13 మంది వినియోగదారులను అరెస్టు చేసింది. 22.6 కిలోల గంజాయి, 2 ఫోన్లు, రూ.22.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై ఇప్పటివరకు 19 కేసులు నమోదయ్యాయి. 2021లో అబ్కారీ శాఖ అధికారులు ఈమెపై పీడీ యాక్టు ప్రయోగించి ఏడాదిపాటు జైల్లో ఉంచారు. నీతూబాయి ఇంటి నుంచి డ్రైనేజీకి లింకు ఉంది. ఎవరైనా సోదాలకు వచ్చినప్పుడు గంజాయిని అందులో విసిరేస్తారు. ఇంటి పరిసరాల్లో ఎవరెవరు వస్తున్నారో గమనించేందుకు సీసీ కెమెరాలున్నాయి.



# గలగలాపారుతున్న గోదావరి జలాలు

**తుర్కపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

తీవ్ర కరవు ప్రాంతమైన ఆలేరు నియోజకవర్గానికి సాగునీరందించి సస్యశ్యామలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేశారు. కాళేశ్వరం కాలువల నుంచి గోదావరి జలాలు గలగలాపారుతున్నాయి. కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి తుర్కపల్లి కెనాల్, ఎం.తుర్కపల్లి కెనాల్ ద్వారా నీటి విడుదల చేయడంతో తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సాగునీరు అందుతోంది. గోపాల్‌పురం, నాగాయిపల్లి, చినలక్ష్మాపురం, మాదాపురం, బోయినిపల్లి, మల్కాపురం, ముల్కలపల్లి, ధర్మారం, గొల్లగూడెం, పల్లెపహడ్ వాసాలమర్రి, తుర్కపల్లి, వెంకటాపురం చెరువులలోకి గోదావరి జలాలు పారుతుండటంతో వాటిలో జలకళ సంతరించుకుంది. కొండాపురం సమీపంలోని కాలువ వద్ద 15హెచ్‌పీ విద్యుత్తు మోటార్లు అమర్చి నీటిని ఎత్తిపోస్తున్నారు. కొండాపురం, తిర్మలాపురం, వీరారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన చెరువులు త్వరలో నిండనున్నాయి. 15వ ప్యాకేజీ మెయిన్ కాలువ నుంచి గంధమల్ల చెరువుని నింపారు. సంగ్యతండా వద్ద ప్రత్యేకంగా డీబీ ఏర్పాటు చేసి సాగునీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతమైన యాదగిరిగుట్ట మండలంలోని చెరువులు నిండనున్నాయి. గొలుసు కట్టు చెరువులను గోదావరి జలాలతో నింపే కార్యాచరణ కొనసాగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రుణం.. పురోగమనం

**మాడ్గులపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తారనే దానికి చక్కటి ఉదాహరణ ఈ మహిళ. ఉన్నత విద్యావంతుడైన కుమారుడి సలహాల మేరకు హోమ్‌ఫుడ్ వ్యాపారం చేస్తూ ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తూ ..మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు మాడ్గులపల్లి మండలం పాములపహాడ్ గ్రామానికి చెందిన అలుగుబెల్లి అరుణమ్మ. ఈమె గ్రామంలో పొదుపు సంఘాల్లో సభ్యురాలిగా ఉన్నారు. మొదట సంఘం తరపున తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించడంతో స్త్రీనిధి రుణాలు ఇచ్చారు. వాటిని వినియోగించుకొని ఆర్థికంగా బలపడ్డారు.

కుమారుడు స్వాదర్‌రెడ్డి ఎమ్మెస్సీ చేసి ఐఐసీటీలో ఉద్యోగం చేసేవారు. ఆయన సలహాలు, సూచనలతో హోమ్‌ఫుడ్ వ్యాపారం చేయాలని భావించారు. దానికోసం వ్యక్తిగతంగా పీఎమ్.ఎఫ్.ఎమ్.ఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకం కింద సబ్సిడీతో కూడిన రుణం రూ.18 లక్షలు తీసుకున్నారు. ఈ రుణంతో పాటు మరికొంత నగదును బ్యాంకు ద్వారా లోన్ తీసుకొని మొత్తం రూ.40 లక్షలతో (దర్శీ హోమ్ మేడ్ ఫుడ్స్) వ్యాపారం మొదలుపెట్టారు. వాటిలో భాగంగా ముడి సరకులను ఇక్కడే కొనుగోలు చేసి చెకోడీలు, కారాబూందీ, మిక్షర్, లడ్డూ, స్వీట్లు తయారు చేస్తున్నారు. మార్కెటింగ్ కోసం ముందుగానే జిల్లా వ్యాప్తంగా ఉన్న బేకరీ, స్వీట్‌హౌస్, కిరాణం తదితర వ్యాపార దుకాణాల వద్దకు వెళ్లి తమ ఉత్పత్తుల గురించి వివరించారు. అవసరమైతే రవాణా చేస్తామని చెప్పడంతో వీరి మార్కెటింగ్ పెరిగింది. ప్రస్తుతం రెండు సంవత్సరాలు గడుస్తుండటంతో..రోజుకు సుమారు రూ.10వేల వరకు గిరాకీ ఉంటుంది. అన్ని ఖర్చులు పోనూ నెలలో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని అరుణమ్మ చెబుతున్నారు. హోమ్‌ఫుడ్ తయారీ వ్యాపారం బాగా సాగుతుండటంతో కుమారుడు తన ఉద్యోగాన్ని వదిలి తల్లికి సహాయంగా ఇక్కడే ఉంటూ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం వీరి ఉత్పత్తులు ఉమ్మడి నల్గొండతో పాటు, జనగామ, వరంగల్, హన్మకొండ జిల్లాలకు విస్తరించాయి.

పని కల్పించడం సంతోషంగా ఉంది.. : అలుగుబెల్లి అరుణమ్మ, నిర్వాహకురాలు

నా కొడుకు సలహాలతో ఫ్యాక్టరీని పెట్టాము. నాతో పాటు ఇంకా పది నుంచి పదిహేను మంది ఇక్కడ పని చేస్తారు. వారి కూడా పని కల్పించడం సంతోషంగా ఉంది. హోమ్‌ఫుడ్ తయారీ పరిశ్రమను ఇటీవల డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో మహిళలు ఇలా చక్కటి అవకాశాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని సూచించారు

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU తెలుగు దిన పత్రిక



## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అడిగే ప్రశ్నలు ఇవే

**హైదరాబాద్ తెలంగాణ ముచ్చట్లు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించేందుకు సర్వే కొనసాగుతోంది. సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేస్తున్నారు. ప్రజా పాలనలో ఇళ్ల కోసం మొత్తం 3,02,696 దరఖాస్తులు వచ్చాయి. అందులో అర్హులను గుర్తించేందుకు యాప్‌ను వాడుతున్నారు. తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తామని ఇదివరకే స్పష్టం చేసింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందనుంది.ఒకవైపు సర్వే మరోవైపు యాప్ ఇబ్బందులు : ఒకవైపు సర్వే చేస్తుండగా మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వివరాలు నిక్షిప్తం చేసే సమయంలో సర్వేయర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా పాలన దరఖాస్తులో రాసిన చిరునామాకు వెళ్తే కొందరు అందుబాటులో ఉండడం లేదు. సమయానికి వారు దొరకడం లేదు. అప్లికేషన్‌లో రాసిన సెల్‌ఫోన్ నంబర్ పని చేయడం లేదు. ముఖ్యంగా శివారు గ్రామాల్లో యాప్ తెరుచుకోవడం లేదు. దీంతో సర్వే చేసే వారికి వివరాలు పొందుపరచడం ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉండగా అధికారులు ఈ నెల 31లోపు సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. సాంకేతిక ఇబ్బందుల కారణంగా గడువులోగా సర్వే పూర్తి చేయడం సందేహంగానే ఉంది.



## రైల్వే టెర్మినలా?
## ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టా!

**చర్లపల్లి తెలంగాణ ముచ్చట్లు**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ మహానగరం హైదరాబాద్‌లో అంగరంగా వైభవంగా ఆవిష్కృతం కానుంది. చర్లపల్లి అనగానే సాధారణంగా కార్మికులు రకరకాల పరిశ్రమల పేర్లు వినిపిస్తాయి. కాని ఇప్పుడు మాత్రం చర్లపల్లి అనే పేరు అత్యాధునికమైన రైల్వే స్టేషనే కదా అనేదాకా వెళ్లనుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రయాణికులకు ఈ నెలాఖరకు అందుబాటులోకి రానుంది. ఈనెల (డిసెంబరు) 28న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో : ఈ చర్లపల్లి టెర్మనల్ భవనంలో ప్రయాణికలకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లాంటివి ఎయిర్ పోర్టలలో ఎలాగైతే ఉంటాయో అలా వసతులను నిర్మించారు. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారెంట్, శౌచాలయాల వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.ోపలివైపు ఎయిర్ పోర్ట్ తరహాలో హంగులు

**ఎయిర్‌పోర్ట్ తరహా హంగులు** : కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా విశాలమైన స్థలం (కన్‌కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో కొత్తం టెక్నాలజీని ఉపయోగించి ఎలివేషన్‌ను (ముందుభాగం) తీర్చిదిద్దారు. టెర్మినల్ మొదలైతే ప్రయాణికులకు ఉచితంగా వైఫై సదుపాయం కల్పించనున్నారు. చర్లపల్లి హైదరాబాద్ శివారులో ఉంది కాబట్టి ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే పలు రైళ్లు ఇక్కడి నుంచే రైలు బండి కూతలతో ప్రారంభం కానున్నాయి. తద్వారా జంట నగరాల్లోని (హైదరాబాద్, సికింద్రాబాద్) ప్రధాన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలని రైల్వే శాఖ అంతిమ లక్ష్యం. ఈ టెర్మినల్ ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాక మహానగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచికూడ రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయ సంఖ్యలో తగ్గిపోనుంది. చర్లపల్లి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనంగా మరో 25 జతల ట్రైన్స్ ఇక్కడి నుంచి పరుగులు తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణాను మెరుగు పరిచేందుకు చర్యలకు ఉపక్రమించింది.



## మల్టీపర్పస్ హెల్త్
## అసిస్టెంట్‌లకు ఊరట..

- మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు సుప్రీంకోర్టులో ఊరట..
- ఏపీ, తెలంగాణకు చెందిన 1,200 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు ఊరట..
- స్టేటస్ కో విధించింది సుప్రీంకోర్టు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది.. ఏపీ, తెలంగాణకు చెందిన 1,200 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు శుభవార్త చెప్పింది సుప్రీంకోర్టు.. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామక జీవోను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించగా.. వాటిపై స్టేటస్ కో విధించింది సుప్రీంకోర్టు.. ఇక, ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.. మరోవైపు ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 22వ తేదీకి వాయిదా వేసింది సుప్రీంకోర్టు..కాగా, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ నోటిఫికేషన్ కు సంబంధించి అర్హతల వివాదంపై సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ఉల్లంఘించి దొడ్డిదారిన ప్రభుత్వం జీవో జారీ చేసిందని.. దాని ద్వారా నియామకాలు చేపట్టడం చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం విదితమే.. అయితే, హైకోర్టు ఉత్తర్వులతో తొలగించిన 1,200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 1207 చట్ట విరుద్ధమని పేర్కొంది హైకోర్టు.. అయితే, ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లడంతో.. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు సుప్రీంకోర్టులో ఊరట దక్కినట్టు అయ్యింది.

## భారతీయులకు గుడ్‌న్యూస్
# ఇకపై హెచ్-1బీ వీసా ప్రాసెస్ ఈజీ!

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

అమెరికాలో ఉద్యోగాలు చేయాలని అనుకునే యువతకు జో బైడెన్ కార్యవర్గం ఓ గూడ్ న్యూస్ చెప్పింది. హెచ్ 1 బి వీసాలను సరళీకరిస్తూ కొత్త నిబంధనలను ప్రకటించింది. తద్వారా అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను ఉద్యోగాల్లో నియమించుకోవడాన్ని సులభతరం చేసింది. అంతేకాకుండా సులువుగా ఎఫ్1 విద్యార్థి వీసాలను హెచ్1బీ వీసాలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది.

**పోటీ ఇచ్చేందుకే**

హెచ్1బీ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను ఈ వీసా ద్వారా నియమించుకొంటుంటాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు దీని నుంచి చాలా లబ్ధి పొందాయి. ఈ క్రమంలోనే కంపెనీలకు సౌలభ్యం కల్పించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) కొత్త నిబంధనలను ప్రకటించింది. దీనిప్రకారం నాన్‌ప్రాఫిట్, ప్రభుత్వేతర పరిశోధన సంస్థల నిర్వచనం, నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. దీని ప్రకారం సంస్థలు అవసరాలకు తగినట్లు నియామకాలు చేసుకొని ప్రపంచ మార్కెట్లో పోటీ ఇచ్చేందుకు ఉపయోగపడతాయని డీహెచ్ఎస్ పేర్కొంది.ఈ కొత్త నిబంధన ప్రకారం ఎఫ్1 విద్యార్థి వీసాలను తేలిగ్గా హెచ్1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించడం వల్ల ఇప్పటివరకు ఉన్న చట్టపరమైన అడ్డంకులు తొలగినట్లైంది. గతంలోనే హెచ్1బీ వీసా పొందినవారి పౌరసత్వం, ఇమిగ్రేషన్ సేవలకు సంబంధించిన దరఖాస్తులను కూడా వేగంగా ప్రాసెస్ చేయనున్నారు. అమెరికాలోని వ్యాపార సంస్థలకు కార్మికుల అవసరాలు తీర్చేందుకు బైడెన్ ఈ నిర్ణయం తీసుకొన్నట్లుగా సమచారం. ఆ సంస్థలపై పడుతున్న అనవసర ఆర్థిక భారాన్ని కూడా తగ్గిస్తుంది. ఇక కొత్త విధానంలో లేబర్ కండీషన్ అప్లికేషన్ కచ్చితంగా హెచ్1బీ వీసా పిటిషన్‌కు అనుగుణంగా ఉండాలి. జో బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనలు 2025 జనవరి 17 నుంచి అమలుకానున్నాయి. అమెరికాలో ఏటా 65 వేల హెచ్1బీ వీసాలకు, అదనంగా మరో 20 వేల అడ్వాన్స్ డిగ్రీ వీసాలకు అనుమతి ఇస్తుంది.






## చైనా పర్యటనలో అజిత్ ధోబాల్

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సరిహద్దుల్లో శాంతి, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ చర్చలు జరిపారు. అలాగే ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం సహా అనేక అంశాలపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్, అజిత్ ధోబాల్ చర్చించుకున్నారు.

**గల్వాన్ లోయ ఉద్రిక్తతల తర్వాత ఇదే తొలిసారి**

గల్వాన్ లోయ ప్రతిష్టంభన తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత్, చైనా సరిహద్దు సమస్యలు, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపాయి. చైనా ప్రత్యేక ప్రతినిధుల చర్చల 23వ రౌండ్‌లో పాల్గొనేందుకు భారత ప్రతినిధుల బృందానికి నేతృత్వం వహిస్తున్న ధోబాల్ చైనా పర్యటనకు వెళ్లారు. 2019లో చైనా, భారత్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఆ తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నిలిచిపోయాయి.

**మోదీ, జిన్‌పింగ్ భేటీ- ముందుకు సాగిన చర్చలు**

అక్టోబరు 24న రష్యాలో జరిగిన బ్రిక్స్ సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ఆ తర్వాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సైతం జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా చైనా విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. అయితే ప్రధాని మోదీ, జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహన సందర్భంగా భారత్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా మంగళవారం తెలిపింది. భారత్ చర్చలకు సానుకూలంగా ఉన్నామని స్పష్టం చేసింది. ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల మధ్య కీలక దౌత్య సంబంధిత చర్చలు జరుగుతాయని పేర్కొంది.

**'భారత్‌తో విభేదాల పరిష్కారానికి సిద్ధం'**


భారత్‌తో ఉన్న విభేదాలను చిత్తశుద్ధితో పరిష్కరించుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ తెలిపారు. చైనా, భారత నాయకుల మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహనను అమలు చేస్తామని పేర్కొన్నారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలు, విశ్వాశాలను బలోపేతం చేయడానికి చైనా సిద్ధమని వెల్లడించారు. చైనా, భారత్ మధ్య సంబంధాలు స్థిరమైన, ఆహ్లాదకరమైన అభివృద్ధికి దారితీస్తాయని అభిప్రాయపడ్డారు.ఆ ఘర్షణ తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న సంబంధాలు 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్ లోయలో చైనా, భారత్ బలగాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది అక్టోబరు 21న గల్వాన్ లోయ ప్రతిష్టంభన తర్వాత సరిహద్దు నుంచి భారత్, చైనా బలగాలు వెనక్కితగ్గాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్, చైనా మధ్య ఉన్న 3,488 కిలోమీటర్ల సరిహద్దు సమస్యను సమగ్రంగా పరిష్కరించే ఉద్దేశంతో 2003లో ఏర్పాటైన కమిటీ ఇప్పటి వరకు 22 సార్లు సమావేశమైంది. చివరి సారిగా 2019లో చర్చలు జరిపింది. తాజాగా మూడోసారి సమావేశమై ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్యలపై చర్చించింది.



## భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా రెడీ!'

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఇరుదేశాల ఉమ్మడి అవగాహనలను అమలు చేయడానికి, ద్వైపాక్షిక సంబంధాలను వీలైనంత త్వరగా గాడిన పెట్టడానికి భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమని చైనా తెలిపింది. రెండు దేశాల ప్రధాన ఆందోళనలను గౌరవించుకోవడం, చర్చల ద్వారా పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లిన్ జియాన్ వివరించారు. చిత్తశుద్ధితో విభేదాలను పరిష్కరించుకోవాల్సిన అవసరముందని తద్వారా స్థిరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవాలని పేర్కొన్నారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ బుధవారం బీజింగ్‌లో ప్రత్యేక ప్రతినిధుల 23వ సమావేశంలో పాల్గొననున్న నేపథ్యంలో ఆ దేశ విదేశాంగశాఖ ఈ ప్రకటన చేసింది. డిసెంబర్ 2019 తర్వాత ఇలాంటి ఉన్నత స్థాయి చర్చలు జరగడం ఇదే తొలిసారి. సరిహద్దుల్లో శాంతి కోసం ఇరుదేశాలకు న్యాయమైన సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం ఈ చర్చల్లో అన్వేషిస్తారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.మరోవైపు, ఇటీవల పార్లమెంట్ ఉభయసభల్లో విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ భారత్‌చైనా సంబంధాలపై మాట్లాడారు. చైనా చర్యల వల్ల 2020లో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతలకు భంగం వాటిల్లిందని అన్నారు. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ మన బలగాలు చైనాను కట్టడి చేశాయని చెప్పారు.అయితే, నిరంతర దౌత్య చర్చల ఫలితంగా ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇటీవల కొంత మెరుగుదల కనిపించిందని జైశంకర్ వివరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడం కోసం పొరుగుదేశంతో దౌత్యపరమైన చర్చలకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయన్నారు. న్యాయమైన, సహేతుక, పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం చైనాతో చర్చలు జరిపేందుకు భారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అంతకుముందు గాల్వాన్ లోయ ప్రతిష్టంభన తర్వాత సరిహద్దు నుంచి భారత్, చైనా బలగాలు వెనక్కితగ్గాయి. ఈనేపథ్యంలో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## ముంబయి తీరంలో మునిగిన ఫెర్రీ

**ముంబాయి తెలంగాణ ముచ్చట్లు:**

ముంబయి తీరంలో బుధవారం పడవ ప్రమాదం జరిగింది. గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా ద్వీపానికి ప్రయాణికులతో వెళ్తోన్న ఫెర్రీ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారని, 101 మందిని కాపాడినట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు.కాగా, ఈ ఘటన ఫెర్రీని స్పీడ్ బోటు ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరికొందరి ఆచూకీ లభ్యం కాలేదని, వారికోసం గాలింపు కొనసాగుతోందని దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన నేవీ, కోస్టు గార్డు బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. నేవికి చెందిన 11 బోట్లు, మెరైన్ పోలీసులకు చెందిన మూడు బోట్లు, కోస్టు గార్డు చెందిన బోటు రంగంలోకి దిగాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. నాలుగు హెలికాప్టర్లు కూడా గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు సిబ్బంది, స్థానిక మత్స్యకారులు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రమాద సమయంలో ఫెర్రీలో దాదాపు 80 మంది ప్రయాణికులతో పాటు ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు సమాచారం.






## భారత్‌పై ట్యాక్స్ రివెంజ్ తప్పదు

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్ సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. అమెరికా ఉత్పత్తులపై న్యూఢిల్లీ అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తోందని ఆరోపించారు. దీనికి ప్రతీకార పన్ను తప్పదంటూ మళ్లీ హెచ్చరికలు చేశారు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయి. 100, 200శాతం పన్నులు వేస్తున్నాయి. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వాళ్లు మాపై పన్నులు విధిస్తే మేమూ అంతేస్థాయిలో పన్నులు వసూలు చేస్తాం. ఒకవేళ భారత్ 100 శాతం పన్నులు విధిస్తే మేము వారిపై అలాగే ఛార్జ్ చేయకూడదా? ఆయా దేశాలు సుంకాలు వసూలుచేయడం అనేది వారి ఇష్టమే. కానీ, మేం కూడా అలాగే స్పందిస్తాం" అని ట్రంప్ వివరించారు.తాను అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తానని గతంలో కూడా ట్రంప్ హెచ్చరించారు. 2019లో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత్‌ను టారిఫ్ కింగ్‌గా అభివర్ణించారు. అప్పుడు భారత్‌కు జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్GSPని రద్దు చేశారు. అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన ఉత్పత్తులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు లేదా రాయితీలు ఇచ్చేందుకు అమెరికా జీఎస్పీ తెచ్చింది. అయితే ఆ హోదా వల్ల భారత మార్కెట్లలోకి సమాన, హేతుబద్ధ సంధానత లభించలేదని అప్పట్లో ట్రంప్ ఆరోపించారు. ఈ హోదాను పునరుద్ధరణకు ఇరుదేశాల మధ్య చర్చలు చర్చలు జరుగుతున్నాయి.మరోవైపు, భారత్, అమెరికా సంబంధాలపై ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగం కీలక వ్యాఖ్యలు చేసింది. బైడెన్ పాలనలో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడిందని పేర్కొంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా దీన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తంచేసింది. భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రాతో భేటీ సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ డిప్యూటీ సెక్రటరీ కర్ట్ కాంప్‌బెల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
గురువారం 19 –12–2024






# కశ్మీర్‌లో అర్జున్ సర్కార్ పోరాటం

మంచు కొండల్లో మంటలు పుట్టిస్తున్నాడు పోలీసు అధికారి అర్జున్ సర్కార్. శత్రువులపై అతని పోరాటం ఎలా సాగిందో, లక్ష్యం దిశగా ఎలా దూసుకెళ్లాడో తెలియాలంటే 'హిట్: ది థర్డ్ కేస్' విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. శ్రీనిధి శెట్టి కథానాయిక. శైలేశ్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న మూడో చిత్రమిది. అర్జున్ సర్కార్ అనే పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నారు నాని. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కశ్మీర్‌లో జరుగుతోంది. నాని, ఫైటర్ల బృందంపై కొన్ని కీలకమైన పోరాట సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. పాత్రకి తగ్గట్టుగా టఫ్ లుక్‌లో నాని ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారని సినీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: సాను జాన్ వర్ఘీస్.



# శివశక్తి పాట కాశీలో!

నాగచైతన్య కథానాయకుడిగా గీతా ఆర్ట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. బన్నీవాసు నిర్మాత. అల్లు అరవింద్ సమర్పకులు. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇందులోని ఒకొక్క పాటని వరుసగా విడుదల చేస్తోంది చిత్రబృందం. ఇప్పటికే 'బుజ్జితల్లి...' పాటతో సందడిని మొదలు పెట్టగా, త్వరలోనే 'శివ శక్తి...' పాట విడుదల కోసం చిత్రబృందం కాశీ వెళ్లనుంది. అక్కడి డివైన్ ఘాట్స్‌లో ఈ నెల 22న పాటని విడుదల చేయనున్నారు. "శ్రీకాకుళం సాంస్కృతిక వారసత్వాన్ని, పురాతన శ్రీ ముఖలింగం శివాలయాన్ని ప్రతిబింబించే పాట ఇది. సంగీతం పరంగా, విజువల్‌గా అద్భుతం అనిపించేలా ఉంటుంది. జాతర నేపథ్యంలో సాగే ఈ పాటకి శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఉత్సాహపూరిత వాతావరణం, ఆధ్యాత్మిక ఇతివృత్తానికీ జీవం పోసేలా ఉంటుంద"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: షామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి, కళ: శ్రీనాగేంద్ర తంగల.





# అంతర్జాతీయ క్రికెట్‌కు ఆర్ అశ్విన్ రిటైర్మెంట్

ప్రముఖ భారత క్రికెట్ క్రీడాకారుడు రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్ట్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అశ్విన్ ఈ విషయాన్ని ప్రకటించాడు. ఈ ప్రకటన చేసేముందు అశ్విన్ డ్రెస్సింగ్ గదిలో విరాట్ కోహ్లీతో భావోద్వేగానికి గురయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. ఇంతలోనే ఆశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

భారత్ తరపున ఆడినందుకు..భారత్ తరపున ఆడినందుకు ఎంతో గర్విస్తున్నానని అశ్విన్ వీడ్కోలు సమయంలో అన్నాడు. కెరీర్‌లో 106 టెస్టులు, 537 వికెట్లు, 3503 పరుగులు సాధించానని, భారత్ క్రికెట్‌లో తన భాగస్వామ్యం కూడా ఉండటం ఆనందంగా ఉందని అశ్విన్ తెలిపాడు. భారత్ తరపున అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా రికార్డు సాధించాడు. టెస్టుల్లో 6 సెంచరీలు, 116 వన్డేలు, 65 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేలో 156 వికెట్లు, టీ20ల్లో 72 వికెట్లు తీశాడు.14 ఏళ్ల పాటు భారత జట్టు తరపున ఆడాడు. గురువారం అనగా రేపు అశ్విన్ ఇండియాకి రానున్నారు. అశ్విన్ 2011 నవంబర్ 6న వెస్టిండీస్‌పైన టెస్టు క్రికెట్‌తో అరంగేట్రం చేశాడు. మొత్తంగా 287 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడగా.. 775 వికెట్లు తీసుకున్నాడు. మొత్తంగా ప్రపంచ క్రికెట్‌లో అశ్విన్ 11వ స్థానంలో ఉన్నాడు. స్వదేశంలో తిరుగులేని స్పిన్నర్‌గా అశ్విన్ రికార్డు సృష్టించాడు.

ఇది కూడా చూడండి: ఫార్ములా ఈ రేసు లో ఏసీబీ విచారణ కోరుతూ



# టాప్–3లో మంధాన

టీమిండియా మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన ఐసీసీ వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని మెరుగుపరచుకొని టాప్-3లో చోటు దక్కించుకుంది. వన్డే బ్యాటర్లలో మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకులో నిలిచిన మంధాన.. టీ20ల్లో ఓ స్థానం మెరుగై మూడో స్థానం అందుకుంది. వన్డేల్లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు కోల్పోయి 13వ ర్యాంక్‌లో ఉండగా, జెమీమా రోడ్రిగ్స్ ఆరు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంకులో నిలిచింది. బౌలర్లలో దీప్తి శర్మ 5వ, రేణుక 26వ, అరుంధతి రెడ్డి 51వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. టీ20 ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ 10వ, జెమీమా 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో దీప్తి 2వ, టిటాస్ సాధు 52వ ర్యాంకుల్లో నిలిచారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in